
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
శుక్రవారం 2 మే 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్	18005728980
నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	240	270
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.155	215	240

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.5 । కనిష్ఠం 25.8

● వాడవాడలా మేడే



కోదాడలో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

జిల్లా వ్యాప్తంగా కార్మికుల దినోత్సవం మేడేను గురువారం వేడుకగా నిర్వహించారు. పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాలు వాడవాడలా పతాకాలను ఆవిష్కరించి మేడే ప్రాముఖ్యాన్ని వివరించారు. ● 8లో

హుజూర్‌నగర్ నుంచి అనలాగ్ మిషన్ వరకు

● అనలాగ్ వ్యోమగామి శిక్షణకు యువ శాస్త్రవేత్త మోహన్‌సాయి ● అమెరికా అరిజోనాలో ఈ నెల 5 నుంచి 9 వరకు శిక్షణ





ఆరుగాలం కష్టపడి వరిని సాగు చేసి రైతులు ధాన్యాన్ని విక్రయించేందుకు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసినా, దిగుమతి చేసుకునేందుకు మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. తాలు పేరుతో ప్రతీ బస్తాకు నాలుగు కిలోల తరుగు తీస్తున్నారు. క్వింటా ధాన్యానికి సుమారు 4కిలోల తరుగు తీసున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఇష్టమేతేనే కొనుగోలు చేస్తామని లేదంటే చేసేదేంలేదని తెగేసి చెబుతుండటంతో రైతులు ధాన్యం ట్రాక్టర్లతో వెనక్కు తిరిగిరాలేక మిల్లర్లు చెప్పిన ధరకు విక్రయిస్తున్నారు.

తాలు పేరుతో దోపిడీ

- క్వింటా ధాన్యానికి నాలుగు కిలోల కోత
- సకాలంలో దిగుమతి చేసుకోని మిల్లర్లు
- వెనక్కు రాలేక తక్కువ ధరకు విక్రయిస్తున్న రైతులు

హుజూర్‌నగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొత్తం 336 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సహకార సంఘాల ఆధ్వర్యంలో 144 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. హుజూర్‌నగర్ డివిజన్‌లో 37 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. ప్రభుత్వం రైస్ మిల్లులకు ధాన్యం అలాట్‌మెంట్ చేసినా కొనుగోలుకు ముందుకు రాకపోవడంతో మిల్లర్లు అరకొరగా ధాన్యం కొనుగోలు చేస్తూ కొర్రీలు పెడుతున్నారు. సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ డివిజన్లలో నామమాత్రంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. పౌరసరఫరాలశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. దీంతో వాతావరణ మార్పులతో ధాన్యం తడిసి నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతున్నారు.

3.70లక్షల ఎకరాల్లో వరి సాగు

యాసంగి సీజన్‌లో జిల్లాలో 3.70లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. 74వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటివరకు కొనుగోలు చేసినట్టు అధికారులు ప్రకటించారు. జిల్లాలో యాసంగిలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వ లక్ష్యం కాగా, 30శాతం కూడా ధాన్యం కొనుగోలు చేయలేదు. హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డలో శివాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేశారు. ఒక్క హుజూర్‌నగర్ ప్రాంతంలోనే 27వేల హెక్టార్లలో వరి సాగైంది. జిల్లాలోని హుజూర్‌నగర్, కోదాడ డివిజన్లలో 2.70లక్షల ఎకరాల్లో సన్న రకాలను సాగు చేసిన రైతులను ధాన్యం విక్రయించే సమయంలో మిల్లర్లు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. హుజూర్‌నగర్ ప్రాంతంలో 23 మిల్లులు ఉండగా, ఒక్క మిల్లుకు కూడా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు బాధ్యతను అప్పగించలేదు. హుజూర్‌నగర్ డివిజన్‌లోని 1.20లక్షల ఎకరాల్లోని పంటను గడ్డిపల్లి రైస్ మిల్లుకు అలాట్ చేశారు. పట్టణంలోని ఎఫ్‌సీఐ గోడౌన్‌లో ఆరు వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దిగుమతి చేశారు.

అంతటా ఇదే పరిస్థితి

హుజూర్‌నగర్ పట్టణంలోని గోదాంలు ధాన్యంతో నిండినందున బూరుగడ్డ సహకార సంఘానికి సంబంధించి ధాన్యాన్ని మునగాలలోని బిన్నీ రైస్ మిల్లుకు అటాచ్ చేశారు. బూరుగడ్డకు చెందిన రైతులు కాసాని గోపాలం, యరగాని నర్సయ్య, గుండు మంగమ్మ, బత్తిని సర్వయ్య, చీకూరి నరేష్‌లకు చెందిన 770బస్తాల ధాన్యాన్ని లారీల ద్వారా మునగాల రైస్ మిల్లుకు ఎగుమతి చేశారు. సహకార సంఘం తరఫున ధాన్యం కొనుగోలు చేసిన సీఈవో వాటిని దిగుమతి చేసేందుకు మునగాల బిన్నీ రైస్ మిల్లుకు తరలించారు. కానీ, మిల్లర్లు తాలు పేరుతో తకరారు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. ప్రతీ క్వింటాకు నాలుగు కిలోల తరుగు తీస్తామంటూ కొర్రీలు పెడుతున్నట్లు బూరుగడ్డ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సహకార సీఈవో ధాన్యం కొనుగోలు చేసినా దిగుమతి చేసుకునేందుకు మిల్లర్లు ఇబ్బంది పెడుతున్నారని రైతులు తెలిపారు. తాలు పేరుతో మిగతా 8వ పేజీలో...

ఆంధ్ర నుంచి తరలిస్తున్న ధాన్యం

సరిహద్దు వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయని అధికారులు

కోదాడరూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దు నుంచి ఏపీ రాష్ట్రానికి చెందిన భారీగా తరలివస్తోంది. రాష్ట్రంలో క్వింటాళ్లకు రూ.500 బోనస్‌ను ప్రభుత్వం ప్రకటించడంతో ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలోని తక్కెళ్లపాడు, గరికపాడు, అనుమంచిపల్లి, షేర్‌మేన్‌పేట, బలుసుపాడు, అన్నవరం, బూదవాడ గ్రామాల నుంచి సరిహద్దుల మీదుగా ధాన్యం తరలివస్తోంది. ఏపీలో ధాన్యం ధర తక్కువగా ఉండటం కూడా కారణం. సరిహద్దు గ్రామాలైన నల్లబండగూడెం, రెడ్లకుంట, కాపుగల్లు, కూచిపూడి గ్రామాల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ఇక్కడి రైతుల పేరున ధాన్యం విక్రయిస్తున్నట్టు తెలిసింది. సరిహద్దు వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటుచేయకపోవడంతో ఆంధ్ర నుంచి భారీగా ధాన్యం తరలివస్తోంది. ఏపీలో క్వింటా ధాన్యం ధర రూ.2,000 ఉండగా, తెలంగాణలో రూ.2,300 మద్దతు ధరతోపాటు ప్రభుత్వం రూ.500 బోనస్‌గా ఇస్తోంది. ఇక్కడి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నగదు ముట్టజెప్పి ధాన్యం విక్రయిస్తున్నట్టు తెలిసింది. గత వానాకాలంలో సరిహద్దులో వ్యవసాయశాఖ, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్ట్ ఏర్పాటుచేయగా, యాసంగిలో మాత్రం చెక్‌పోస్ట్ ఏర్పాటుచేయకపోవడంతో పెద్ద మొత్తంలో ధాన్యం తరలివస్తోంది.



ఆంధ్ర నుంచి తెలంగాణలోకి వస్తున్న ధాన్యం ట్రాక్టర్

తెలంగాణకు ప్రధాన శత్రువు కాంగ్రెస్



సైకిల్‌యాత్ర యువతకు సైకిళ్ళు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

● ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట (కలెక్టరేట్), మే 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ చేపట్టిన దీక్ష సమయంలో విద్యార్థుల బలిదానాలకు కాంగ్రెస్ ముఖ్య కారణమని, తెలంగాణ రాష్ట్రానికి ప్రధాన శత్రువు ముమ్మాటికీ కాంగ్రెస్ అని మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే రేవంత్‌రెడ్డి పేరు మర్చిపోతున్నారన్నారు. అసలు ఒక్క మంచి పని చేయని సీఎం రేవంత్‌రెడ్డి పేరును ప్రజలు ఎందుకు గుర్తుకు పెట్టుకుంటారన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను, బీఆర్‌ఎస్ పార్టీని విమర్శించే వాళ్లకు బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ ఒక చెంపపెట్టులాంటిదన్నారు. కాంగ్రెస్ అంటే రేవంత్‌రెడ్డి ఒక్కడే అనే భ్రమలో రేవంత్‌రెడ్డి ఉన్నారని ఆరోపించారు. ఆయనకు కాంగ్రెస్ పార్టీ కన్నా వ్యక్తిగత ప్రచారమే ఎక్కువని విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణపై మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదన్నారు. ఆనాడు తెలంగాణ ఇచ్చింది ప్రేమతో కాదని భయంతో అని తెలిపారు. తెలంగాణను ఆంధ్రలో కలిపిందే కాంగ్రెస్ అని ఉద్యమ సమయంలో 359 మందిని కాల్చి చంపిన చరిత్ర కాంగ్రెస్‌దన్నారు. ఎల్కతుర్తి బీఆర్‌ఎస్ రజతోత్సవసభలో కేసీఆర్ మాటలకు ప్రజలంతా స్వాగతించారని, అధికారం కోసం దిగజారే నైజం రేవంత్‌రెడ్డిది అని, పదవి రాగానే సోనియాని బలి దేవతన్న రేవంత్‌రెడ్డి మాటలను ప్రజలు మరచిపోలేదన్నారు. పదేళ్లు మాదే అధికారం అన్న వాళ్లకు కేసీఆర్ ఫాంహౌస్‌లో ఉంటే భయమెందుకని ప్రశ్నించారు. ఎన్నిరోజులు పదవిలో ఉంటాడో గ్యారెంటీ లేని సీఎం రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు. అడ్డగోలుగా హామీలిచ్చి అమలు చేయలేక ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు. కేసీఆర్‌పై చిల్లర మాటలు మాని హామీల అమలుపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, నాయకులు వై. వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఏప్రిల్ 27వ తేదీన వరంగల్ ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు జిల్లాకేంద్రం నుంచి వెన్న రవితేజరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్‌యాత్రలో ఉపయోగించిన సైకిళ్లను యాత్రలో పాల్గొన్న యువకులకు జగదీష్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో గాలిసాయి, చల్లా లక్ష్మీకాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగదీష్‌రెడ్డి దమ్ముంటే.. రాజీనామా చేసి గెలవాలి

సూర్యాపేట మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

భానుపురి, మే 1(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి దమ్ముంటే రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలో గెలవాలని సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి సవాల్ విసిరారు. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసేస్థాయి జగదీష్‌రెడ్డికి లేదన్నారు. భారతదేశంలోనే పేరు ప్రఖ్యాతలు ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై విమర్శలు చేయడాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు జీర్ణించుకోలేరన్నారు. మరోసారి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని విమర్శిస్తే జగదీష్‌రెడ్డిని సూర్యాపేటలో కాంగ్రెస్ కార్యకర్తలు అడుగుగడుగునా అడ్డుకుంటారని హెచ్చరించారు. 2004లో హుజూర్‌నగర్‌లో ఓటమి పాలైన జగదీష్‌రెడ్డి సూర్యాపేటలో కోట్ల రూపాయలు కుమ్మరించి గెలుస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు రూపకర్త, సూర్యాపేటలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు జగదీష్‌రెడ్డి రూపకర్తతో ఆయా ప్రాజెక్టులు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. వీటిలో ఎంత అవినీతి జరిగిందో అందరికీ తెలుసన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ధరావత్ వీరన్ననాయక్, కరీం, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రమేష్, భైరు శైలేందర్, ఆలేటి మాణిక్యం, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న వేణారెడ్డి

అనుమతి లేకుండా ర్యాలీలు చేపట్టొద్దు

● ఎస్పీ నర్సింహ

సూర్యాపేటక్రైం, మే 1(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా మే నెల 1వ తేదీ నుంచి నెల రోజుల పాటు పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పీ నర్సింహ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ యాక్టు అమల్లో ఉన్నందున ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడే విధంగా సన్నాహాలు చేయవద్దన్నారు.



ఎస్పీ నర్సింహ

పాకిస్తాన్‌తో తేల్చుకోవాలనే అభిప్రాయం ఉంది

● కేసీఆర్ కాంగ్రెస్‌ను విలన్ అనడం అర్థరహితం ● శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి తరువాత పాకిస్తాన్‌తో తాడోపేడో తేల్చుకోవాలనే అభిప్రాయం ప్రజల్లో కనిపిస్తోందని, అయితే యుద్ధం కంటే ఉగ్రవాదాన్ని సమూలంగా నివారించేందుకు చర్యలు తీసుకోవాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పాకిస్తాన్ భూభాగంలో ఉన్న ఉగ్రవాదులను వారి నాయకులను వెంటనే అప్పగించాలన్నారు. జనగణనలోనే కులగణన చేపట్టాలని కేంద్రం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. వివిధ రాష్ట్రాల్లో సామాజిక నేపథ్యాల కారణంగా కులాల రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని, ఈ అంతరాన్ని ఎలా తొలగిస్తారో చెప్పాలన్నారు. 2014 పునర్విభజన చట్టంలో నియోజకవర్గాల పునర్విభజన అమలు చేస్తామని హామీ ఇచ్చారని, ఆ తరువాత జమ్ము కాశ్మీర్‌లో చేశారన్నారు. విభజన చట్టం ప్రకారం అవకాశం ఉన్న తెలంగాణ, ఏపీలలో ఇప్పటి వరకు చేయలేదన్నారు. తెలుగు రాష్ట్రాలపై కేంద్రం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. పదవులు, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, చాలా సందర్భాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతుందని, ఫొటో వివాదాలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. టన్నెల్ ప్రమాదం వల్ల కొంత ఆలస్యమైనప్పటికీ త్వరలోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. తెలంగాణకు కాంగ్రెస్ విలన్ అని మాజీ సీఎం కేసీఆర్ అనడం అర్థరహితమన్నారు. తాను పార్లమెంటు సభ్యుడిగా ఉన్నప్పుడు కేసీఆర్ స్వయంగా అనేక సార్లు తనతో చెప్పారని, సోనియా గాంధీ లేకపోతే తెలంగాణ వచ్చేది కాదని స్వయంగా కేసీఆర్ అన్నారని గుర్తుచేశారు. కేసీఆర్ పోరాటాన్ని కూడా కాదనలేమని, అందుకే ప్రజలు పదేళ్లు అధికారం ఇచ్చారన్నారు. తెలంగాణ బిల్లు ఆమోదంలో కేసీఆర్, సోనియాగాంధీ, సుష్మాస్వరాజ్ పాత్ర కాదనలేమన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుఖేందర్‌రెడ్డి

కార్పస్‌ఫండ్‌ను రూ.500 కోట్లకు పెంచాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న న్యాయవాదులు

హుజూర్‌నగర్, మే 1 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదుల కార్పస్‌ఫండ్‌ను రూ.500 కోట్లకు పెంచాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వి.రంగారావు, కాలువ శ్రీనివాసరావు, వట్టికూటి అంజయ్య, కోరారు. పట్టణంలోని బార్‌అసోసియేషన్ కార్యాలయంలో గురువారం కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చెనగాని యాదగిరి, జక్కుల నాగేశ్వరరావు, బాలకృష్ణ, సైదులు, సత్యనారాయణ, జయరామయ్య, సైదాహుస్సేన్, నాగరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

మూసీకి నిలకడగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

● మరో అడుగు పెరిగిన నీటిమట్టం



మూసీ ప్రాజెక్టుకు 25 రోజులుగా ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతుంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం గత 25 రోజుల్లో 6 అడుగుల మేర పెరిగింది. 645 అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు ఈ నెల మొదటి వారంలో సాగునీటి విడుదలను వేసిన నాటికి ప్రాజెక్టు నీటిమట్టం 623.50అడుగులు (0.71టీఎంసీలు) కనిష్ఠ స్థాయికి పడిపోయింది.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కోదాడటౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు పలు చట్టాలు అమలు చేస్తున్నాయని వాటిపై కార్మికులు అవగాహన పెంచుకోవాలని కోదాడ సీనియర్ సివిల్ జడ్జి కె. సురేష్ అన్నారు. మేడే సందర్భంగా గురువారం కోదాడ కోర్టులో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో కార్మిక చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల పని గంటలు, వేతనాలు వంటి అంశాలపై పలు చట్టాలు ఉన్నాయన్నారు. కార్మిక చట్టాల గురించి అవగాహన పెంచుకొని తమ హక్కులు సాధించుకోవాలని కోరారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ చిత్తలూరి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణ, కోశాధికారి కోడూరు వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు యడ్లపల్లి వెంకటేశ్వర్లు, చలం హుస్సేన్, ధనలక్ష్మీ, సీనియర్ న్యాయవాదులు, వేజెల్ల రంగారావు, గట్ల నరసింహారావు, రాజన్న, మందా వెంకటేశ్వర్లు, హేమలత, దొడ్డ శ్రీధర్, గోవర్ధన్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె. సురేష్

మిస్‌వరల్డ్ పోటీదారులకు పటిష్ట భద్రత

● ఐజీ సత్యనారాయణ ● నాగార్జునసాగర్‌లో ఏర్పాట్ల పరిశీలన



సాగర్ బుద్ధవనంలో ఏర్పాట్లపై ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో చర్చిస్తున్న ఐజీ సత్యనారాయణ ● 7లో..

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీపై కేసు నమోదు

మోటకొండూరు, మే 1(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని కాటేపల్లిలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో మంగళవారం జరిగిన పేలుడు ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఉపేందర్ యాదవ్ తెలిపారు. కాటేపల్లికి చెందిన గునుగుంట్ల సందీప్ 2019 నుంచి ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో పర్మినెంట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం 4.45గంటల సమయంలో కంపెనీలోని 18-ఏ భవనంలో జరిగిన పేలుడు ధాటికి ఏడుగురు తీవ్రంగా గాయపడగా, కాటేపల్లికి చెందిన గునుగుంట్ల సందీప్(30), మోటకొండూరు మండలకేంద్రానికి చెందిన చందోజు దేవిచరణ్(22) శిథిలాలకింద చిక్కుకుని మృతిచెందారు. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే పేలుడు సంభవించిందని సందీప్ తల్లి గునుగుంట్ల మంగమ్మ ఫిర్యాదు మేరకు కంపెనీ డైరెక్టర్ దుర్గాప్రసాద్, ప్రొడక్షన్ మేనేజర్ శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గోవులు తరలిస్తున్న వాహనం పట్టివేత

చౌటుప్పల్ రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌గేట్ వద్ద గోవులు తరలిస్తున్న వాహనాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి నుంచి హైదరాబాద్‌కు 14 గోవులను డీసీఎంలో తరలిస్తుండగా పంతంగి టోల్‌గేటు వద్ద పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడ్డ ఆవులను గోశాలకు తరలించినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో పశువులు మృతి

శాలిగౌరారం, మే 1 (ఆంధ్రజ్యోతి): పొలంలో మేత మేస్తున్న పశువులు విద్యుదాఘాతంతో మృతిచెందాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని ఊట్కూరు గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన కొనపాకుల యాదయ్య రెండు గేదెలు పొలంలో మేత మేస్తుండగా ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. మేత కోసం వచ్చిన గేదలు ఆ తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ.1.05లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. మండలంలోని చిత్తలూరు గ్రామానికి చెందిన గనగాని అశోక్‌కు చెందిన ఎద్దు గ్రామ శివారులో మేత మేస్తుండగా అప్పటికే తెగి పడి నేల మీద ఉన్న తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ దాదాపు రూ.75 వేల వరకు ఉంటుందని బాధితుడు అశోక్ తెలిపాడు. నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

పార్థి గ్యాంగ్‌కు 18 నెలల జైలు శిక్ష

నల్లగొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): అంతరాష్ట్ర దొంగల ముఠా పార్థి గ్యాంగ్ నిందితులకు కోర్టు 18నెలల జైలుశిక్షతో పాటు జరిమానా విధించిందని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. నిందితులు కొన్ని నెలల క్రితం నల్లగొండ జిల్లాలోని చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూరు మండలాలతో పాటు సైబర్ కమిషనరేట్ పరిధిలో, సంగారెడ్డి జిల్లాలో ఎన్‌హెచ్ -65పై వాహనాలను ఆపి నిద్రిస్తున్న వారిపై దాడి చేసి బంగారం డబ్బులు దొంగిలించేవారు. గత ఏడాది మే 18న కట్టంగూరు పీఎస్ పరిధిలో మహారాష్ట్రకు చెందిన నిందితులైన అప్ర పదాంగ, దిల్‌షార్ అశోక్ పవార్‌తో పాటు మరికొందరిపై పోలీసులు కేసులు నమోదు చేసి సరైన ఆధారాలను సేకరించి కోర్టులో చార్జ్ షీటు దాఖలు చేశారు. కోర్టు గురువారం తీర్పు వెల్లడించింది. ఈ కేసులో ఒకొక్కరికి రూ.1000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో ఒక నెల పాటు సాధారణ కారాగార జైళ్ల శిక్ష ఉంటుందని తెలిపారు. పార్థి గ్యాంగ్ మొత్తం 32 కేసుల్లో నేరాలు అంగీకరించింది. ఈ కేసును త్వరితగతిన ఛేదించి శిక్ష పడేలా కృషిచేసిన నార్కట్‌పల్లి సీఐ కె. నాగరాజు, అప్పటి ఎస్‌ఐ సైదాబాబు, చిట్యాల పీఎస్ పోలీస్ ఎస్‌ఐ ప్రసుత్త ఎస్‌ఐ ధర్మా, సీడీవో ముత్తిలింగం, లైజనింగ్ ఆఫీసర్ మల్లికార్జున్‌లను ఎస్పీ అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వలిగొండ, మే 1(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సూర్యాపేట జిల్లా వలిగొండ పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుప్పల్లి గ్రామ మూసీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తవ్వి తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. ట్రాక్టర్ యజమానులు కట్టెల నర్సయ్య, నీల రవి, పలుసం నర్సయ్యపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్‌చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి



యాదగిరి(ఫైల్)

హాలియా, మే 1(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రతతో వడదెబ్బ తగిలి నల్లగొండ జిల్లా అనుముల మం డలం మదారిగూడెం గ్రామంలో ఉపాధి హామీ కూలీ గురువారం మృతిచెందాడు. గ్రామానికి చెందిన కుందారపు యాదగిరి(48) గురువారం ఉపాధి హామీ పనికి వెళ్లి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అతడి కుటుంబ సభ్యులు వైద్య చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా వడదెబ్బకు తోడు గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మేడే సందర్భంగా హాలియాలో కార్మిక వేడుకల్లో పాల్గొన్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జడ్జిల బాధ్యతల స్వీకరణ



యాదగిరిగుట్ట కోర్టు న్యాయమూర్తి చండీశ్వరిదేవిని సన్మానిస్తున్న న్యాయవాదులు

ఆలేరు, యాదగిరిగుట్ట రూరల్, మిర్యాలగూడ లీగల్, మే 1(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా అజయ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కోర్టు న్యాయవాదులు జడ్జికి స్వాగతం పలికారు. ఇక్కడ పని చేసిన జడ్జి సూర సుమలత పదోన్నతిపై వెళ్లడంతో ఆమె స్థానంలో భువనగిరి సివిల్ కోర్టు జడ్జి కవిత ఇన్‌చార్జి జడ్జిగా కొంత కాలం పనిచేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వనం రాజు, సీనియర్ న్యాయవాదులు జూకంటి రవీందర్, తుంగ హరికృష్ణ, రావుల రజితరెడ్డి, పి రవిందర్, పాషా, రాజశేఖర్, సిద్దులు, శివకుమార్ ఉన్నారు. యాదగిరిగుట్ట న్యాయమూర్తిగా చండీశ్వరిదేవి బాధ్యతలు స్వీకరించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు సూదగాని శ్రీహరిగౌడ్, గుడ్ల స్వామి, న్యాయవాదులు ఎం. రాజిరెడ్డి, పెంట రమేష్, ఐరేని కృష్ణ, దండెబోయిన గణేష్‌యాదవ్, బి. రేణుక, వినీత, కనకరాజు, డప్పు వీరస్వామి, గొట్టిపాములు సాయికృష్ణ పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ జూనియర్ సివిల్ జడ్జిగా పి.పవన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిచయ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి జి.వేణు మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బి.సుజయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ, కార్యదర్శి ఎ.రాజ్‌కుమార్‌రెడ్డి, న్యాయవాదులు గౌరు వెంకటేశ్వర్లు, సీహెచ్.రాఘురామరావు, జిన్నె శ్రీనివాస్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, మంద సైదులు, కుమార్ రెడ్డి, గంగాభవాని, నాగేందర్, ఇస్మా, పూసపాటి పరమేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

మోటకొండూరు, మే 1(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని కాటేపల్లిలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో మంగళవారం సంభవించిన భారీ పేలుడు దాటికి మరణించిన మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25లక్షలు, గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కురుమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, హైకోర్టు మాజీ సహాయ ప్రభుత్వ న్యాయవాది గొరిగే మల్లేష్ డిమాండ్ చేశారు. కాటేపల్లిలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ పరిసరాలను, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను గురువారం పరామర్శించారు. ప్రమాదంలో గాయపడిన వారికి పూర్తిస్థాయిలో మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంట గొరిగే అయిలయ్య, జెన్ని రఘు, గొరిగే పెద్ద మల్లేష్ ఉన్నారు.

హుజూర్‌నగర్ నుంచి అనలాగ్ మిషన్ వరకు

● అనలాగ్ వ్యోమగామి శిక్షణకు యువ శాస్త్రవేత్త మోహన్‌సాయి ● అమెరికా అరిజోనాలో మే 5 నుంచి 9 వరకు శిక్షణ ● ప్రపంచవ్యాప్తంగా 18 మంది శాస్త్రవేత్తలకు అవకాశం



అన్‌లాగ్ మిషన్‌కు ఎంపికైన యువశాస్త్రవేత్త మోహన్‌సాయి

హుజూర్‌నగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన యువ శాస్త్రవేత్త ఆకుల మోహన్‌సాయికి అరుదైన అవకాశం లభించింది. అమెరికాలోని అరిజోనాలో మే 5 నుంచి 9వ తేదీ వరకు ప్రపంచంలోని అతిపెద్ద అనలాగ్ వ్యోమగామి శిక్షణకు ఎంపికయ్యారు. బయోస్పియర్-2 అనే అనలాగ్ స్థావరంలో జరిగే ఈ శిక్షణకు ప్రపంచ నలుమూలల నుంచి 18మంది యువ శాస్త్రవేత్తలకు అవకాశం దక్కింది. భారతదేశం నుంచి ఇద్దరికి అవకాశం రాగా అందులో తెలంగాణ రాష్ట్రం నుంచి మోహన్‌సాయి ఒకరు. ఈ శిక్షణ మార్స్ లాంటి ఉపరితలం లాంటి పరిస్థితుల్లో జీవించడం, పనిచేయడం, అధ్యయనం చేయడానికి ప్రత్యేకంగా రూపొందించబడింది.

ప్రస్తుతం మోహన్‌సాయి ముంబాయిలోని అమిటీ యూనివర్సిటీలో ఆస్ట్రో బయాలజీ అండ్ స్పేస్ సైన్స్ 2023-25 కోర్స్‌లో తెలంగాణ రాష్ట్రం నుంచి ఏకైక విద్యార్థిగా విద్యనభ్యసిస్తున్నారు. మాస్టర్స్ థీసిస్-లూనార్ సోయిల్ సిములెంట్ (ఎల్ఎస్ఎస్)పై పంటలు పెంచడంపై ప్రయోగాత్మక పరిశోధన చేస్తూ భారత భవిష్యత్ చంద్రయాన స్థిర నివాసాల కోసం ప్రయత్నిస్తున్నారు. రెండేళ్లుగా హైదరాబాద్, బెంగళూరు, పూనే వంటి నగరాల్లో నాలుగు వేల మంది విద్యార్థులకుపైగా శాస్త్ర విజ్ఞానాన్ని చేరువ చేస్తూ స్పేస్ అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించారు.

వర్చువల్ ట్రైనింగ్ పూర్తి చేసి..

2004 ఫిబ్రవరిలో ప్రపంచ స్థాయి వరల్డ్ బిగ్గెస్ట్ అనలాగ్ మిషన్‌కు 2200 మందికి పైగా దరఖాస్తు చేశారు. 18 మందిని ఎంపిక చేయగా అందులో సాయి ఒకరు. సహచరుల సమీక్షలతో కూడిన మాడ్యుళ్ళు, సైకలాజికల్, కాగ్నిటివ్ అసెస్‌మెంట్లు, సాంకేతిక ఇంటర్వ్యూలు, సిద్ధాంత పాఠాలు, మిషన్ అనుకరణలు పూర్తిచేసి 2024 నవంబరులో నిర్వహించిన వర్చువల్ ట్రైనింగ్ విజయవంతంగా పూర్తిచేసి డిసెంబరులో జరిగిన



తుదిపరీక్షల్లో 97శాతం స్కోర్ సాధించి 2025 జనవరి 25న ఎంపికయ్యారు.

● 2035 భారత్ అంతరిక్ష స్టేషన్, 2040లో చంద్రుడిపై మొదటి మానవ మిషన్ చేపట్టేందుకు సిద్ధమవుతున్న తరుణంలో మోహన్‌సాయి తన పరిశోధన, శిక్షణలతో దేశం తరపున ఈ లక్ష్యాలను బలపరుస్తున్నారు. ఇప్పటి వరకు అంతర్జాతీయ ప్రయాణాలు, శిక్షణలు, మిషన్ వ్యయాలను భరించిన మోహన్‌సాయి తన శాస్త్రీయ ప్రయాణాన్ని కొనసాగించేందుకు ముందుకు సాగుతున్నారు. వైజ్ఞానిక పరిశోధన, జీవన పోరాటం, ప్రపంచస్థాయి ప్రతినిధిత్వం-ఇవన్నీ ఆర్థిక అడ్డంకులతో పోరాడుతూ సమతుల్యం చేస్తున్నట్లు మోహన్‌సాయి పేర్కొంటున్నారు. అమెరికా దేశానికి పరిశోధనకు మే 2న వెళుతున్న మోహన్‌సాయి ప్రపంచంలోనే అతిపెద్ద అనలాగ్ వ్యోమగామి మిషన్‌కు వెళుతున్న తరుణంలో క్లిష్టమైన మిషన్‌లో శిక్షణ పూర్తిచేసుకునేందుకు దృష్టి సారించినట్లు మోహన్‌సాయి తన లక్ష్యాన్ని 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

ఉత్తమ పరిశోధన అవార్డు



మోహన్‌సాయి 2023-24 సంవత్సరాల్లో రెండు అంతర్జాతీయ లూనార్ అన్‌లాగ్ మిషన్లు(పోలాండ్, యూరప్) పూర్తిచేశారు. మొదటి మిషన్ తర్వాత ఐఎస్ఆర్ఓ ఆధ్వర్యంలో జరిగిన ఎన్ఎస్ఎస్ఎస్ 2024లో ఉత్తమ పరిశోధన అవార్డు అందుకున్నారు. ఏప్రిల్ 2024న పోలాండ్‌లోని మిలటరీ ఏరోస్పేస్ ఇనిస్టిట్యూట్‌లో +4.5జీ సెంట్రిఫ్యూజ్ అండ్ జీరో గ్రావిటీ శిక్షణ పొందారు. ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రీయ దౌత్యాన్ని ప్రోత్సహిస్తూ 2024 అక్టోబరులో లూనారెస్ రీసెర్ఫ్ స్టేషన్(యూరప్) వారు భారత అంతరిక్ష దౌత్య ప్రతినిధిగా మోహన్‌సాయిని ప్రకటించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను నల్లగొండ వన్‌టౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా దర్మాటి దుర్గాప్రసాద్, కాకినాడకు చెందిన పాశిల సత్యనారాయణ, అదే జిల్లాకు చెందిన కామాడి శ్రీనివాస్ 2024 సంవత్సరం అక్టోబరులో నల్లగొండలో రైలులో వచ్చి అలకాపురి కాలనీలో తాళం వేసి ఉన్న ఇంటి తాళాలు పగులగొట్టి రెండు బంగారు చైన్‌లు, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లారు. అదే సంవత్సరం డిసెంబరు లో నల్లగొండ పట్టణంలో మహిళా ప్రాంగణం పరిధిలో ఇంటి ఎదుట పార్కు చేసిన పల్సర్ బైక్‌ను ఎత్తుకెళ్లారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ఈ ముగ్గురు దొంగలు గతంలో ఎత్తుకెళ్లిన పల్సర్ బైక్‌పై కాకినాడ నుంచి నల్లగొండకు వచ్చి అక్కలాయిగూడెం ప్రాంతంలో తాళం వేసిన ఇంట్లోకి ప్రవేశించి తాళాలు పగులగొట్టి 12తులాల బంగారం ఆభరణాలు, 50తులాల వెండి, రూ.1.25లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఈ మూడు నేరాల్లో నిందితుల పోలీసులు నుంచి బంగారు ఆభరణాలు, మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ధర్మాటి దుర్గాప్రసాద్ పరారీలో ఉన్నారన్నాడు. సత్యనారాయణ, శ్రీనివాస్‌ను అరెస్టు చేశారు. ఈ కేసును చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బి. డానియెల్‌కుమార్, ఎస్‌ఐ శివకుమార్, సిబ్బంది విష్ణు, సీఐ రాజశేఖర్‌రెడ్డిని, నల్లగొండ వన్‌టౌన్ ఎస్‌ఐ గోపాల్‌రావును, హెడ్‌కానిస్టేబుల్ శివరామకృష్ణ, కానిస్టేబుళ్ల శ్రీకాంత్, అంజద్, గాంధీలను డీఎస్పీ శివరాంరెడ్డి అభినందించారు.

పుట్టినరోజు వేడుకలకు వెళ్లి వస్తూ..



దుర్గాప్రసాద్ (ఫైల్)

బీబీనగర్, మే 1(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు హాజరై స్నేహితులతో ఆనందంగా గడిపి అనంతరం ఇంటికి తిరిగి వస్తున్న ఓ యువకుడిని రోడ్డు ప్రమాదం కబళించింది. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో గురువారం ఉదయం జరిగింది. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామానికి చెందిన కూనూరు అమరేందర్‌గౌడ్ ఏకైక కుమారుడు కూనూరు దుర్గాప్రసాద్ (20) ఐఎఫ్‌టీలో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం కాటేపల్లి గ్రామంలోని ఎక్స్‌ప్లో కంపెనీలో పేలుడు ఘటనలో మృతి చెందిన సందీప్ అంత్యక్రియలో పాల్గొని అదేరోజు సాయంత్రం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లో తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు బయలు దేరి వెళ్లాడు. రాత్రంతా స్నేహితులతో ఆనందంగా గడిపి తెల్లవారు జామున ద్విచక్ర వాహనంపై స్వగ్రామం కాటేపల్లికి బయలు దేరాడు. మార్గమధ్యలో బీబీనగర్ బైపాస్ రోడ్డులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి పైన వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొట్టడంతో బైకు అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఎన్‌హెచ్ఏఐ అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని యువకుడి మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. ఈ ప్రమాద సంఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అన్ని అంశాలపై అవగాహన కల్పించాలి

● నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



విద్యార్థులతో చెస్ ఆడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు, విద్యార్థులకు అన్ని అంశాలపై అవగాహన కల్పించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లాకేంద్రంలోని బోయవాడ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. శిక్షణ శిబిరానికి వచ్చిన పిల్లలతో కలెక్టర్ ముచ్చటించారు. ఏ సబ్జెక్టు అంటే ఇష్టమని, ఎలాంటి ఆటలు ఇష్టమని, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో కలిసి చెస్ ఆడారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే చదువుతోపాటు, అన్ని విషయాల్లో ముందు ఉండాలని సూచించారు. శిక్షణ శిబిరాన్ని నల్లగొండ పట్టణంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, ఎరైజర్లు, స్కెచ్ పెన్నులు, వాటర్ కలర్స్ పంపిణీ చేశారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు 15 రోజుల పాటు నిర్వహించే ఈ వేసవి శిక్షణ శిబిరంలో ఇండోర్ గేమ్స్, డాన్స్, హస్తకళలు, డ్రాయింగ్, పెయింటింగ్, కెరియర్ గైడెన్స్, నైతిక విలువలు, స్టోరీ టెల్లింగ్ తదితర అంశాలలో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బి. బిక్షపతి, నాగార్జునసాగర్ బాలకేంద్రం పర్యవేక్షకులు, బాల కేంద్రం ఇన్‌చార్జి బాలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ. అంజద్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధి కోసమే కులగణన

● బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బూర నర్సయ్యగౌడ్



మోటకొండూరు మండలం కాటేపల్లిలోని ప్రీయర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీ పేలుడులో మృతిచెందిన దేవిచరణ్ తల్లిని ఓదారుస్తున్న మాజీ ఎంపీ బూర

భువనగిరి టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ తదితర అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధి కోసమే కేంద్ర ప్రభుత్వం కులగణ చేపడతుందని మాజీ ఎంపీ, ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. భువనగిరిలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1931లో దేశంలో బ్రిటిష్ పాలనలో కులగణన జరిగిందని తిరిగి బీజేపీ హయాంలో జరుగుతుందన్నారు. దేశంలో ఇప్పటివరకు ఆరు పర్యాయాలు జనాభా లెక్కలు జరగగా దేశాన్ని అధికంగా పాలించిన కాంగ్రెస్ హయాంలో ఐదు పర్యాయాలు జనాభా లెక్కల గణన జరిగిందని, కానీ ఏ ఒక్కసారి ఆ పార్టీ కులగణనను చేపట్టలేదని విమర్శించారు. తెలంగాణలో 53శాతం ఉన్న బీసీలను రాజకీయంగా అణగ తొక్కిందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనలో 43శాతానికి పరిమితం చేసిందని విమర్శించారు. ప్రధాని మోదీ ప్రభుత్వం మాత్రం దేశంలో సామాజిక ఐక్యత దెబ్బతినకుండా జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టనుందన్నారు. అగ్రవర్ణాల పేదలకు బీజేపీ అమలులోకి తెచ్చిన 10శాతం ఈ బీసీ రిజర్వేషన్లతో ముస్లింలతో సహా హిందూ అగ్రవర్ణాల పేదలు, ఐఏఎస్, ఐపీఎస్ తదితర ఉన్నత ఉద్యోగాలకు ఎంపిక అవుతున్నారనేది విస్మరించరాని నిజమన్నారు. మోటకొండూరు మండలం ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ పేలుళ్ల దుర్ఘటనను కేంద్ర మంత్రులు, కేంద్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. పరిశ్రమ నిర్వహణ, భద్రతా, కార్మికుల శిక్షణా లోపాలతోనే ప్రమాదం ఆరోపించిందన్నారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఈఎస్ఐ నుంచి రావల్సిన బెనిఫిట్స్‌లను ఇప్పిస్తామని, పరిశ్రమ నిర్వహణ, అనుమతులపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కులగణనపై హర్షిస్తూ ప్రధాని మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా, పట్టణ అధ్యక్షులు ఊట్కూరి అశోక్‌గౌడ్, రత్నపురం బలరాం, పోతంశెట్టి రవీందర్, పాశం భాస్కర్, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, చందా మహేందర్‌గుప్తా, ఎండీ మహ్మద్ నాయకులు మాయ దశరథ, సుర్వి శ్రీనివాస్‌గౌడ్, పట్నం శ్రీనివాస్, డీఎల్ఎన్ గౌడ్, జి నరసింహచారి పాల్గొన్నారు.

పేలుడు బాధిత కుటుంబాలకు పరామర్శ

ఆత్మకూరు(ఎం), మోటకొండూరు: యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామంలో ప్రీయర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో మంగళవారం జరిగిన పేలుడు సంఘటనలో మృతిచెందిన ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన కల్వల నరేష్(32) కుటుంబసభ్యులను భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరు అశోక్ గురువారం పరామర్శించారు. నరేష్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నరేష్ తండ్రి అంజయ్యకు ధైర్యం చెప్పారు. పేలుడు ఘటనలో మృతిచెందిన మోటకొండూరు మండలంలోని గునుగుంట్ల సందీప్, చందోజు దేవిచరణ్ కుటుంబసభ్యులను కూడా పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాశం భాస్కర్, జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు యెల్లంల శ్రీధర్‌రెడ్డి జి. కాశీనాథ్, డి. కుమారస్వామి, బి. అబ్బయ్య, బి. ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

కొండమల్లేపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ మౌనిక హెచ్చరించారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి స్థానిక చౌరస్తాలో గురువారం రాత్రి ఇన్‌చార్జి సీఐ రాజుతో కలిసి చేసి బ్రీత్ ఎనలైజర్ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై సరైన పత్రాలు, నంబర్ ప్లేటు లేని వాహనాలపై మొత్తం 20మందిపై కేసులు నమోదు చేసినట్టు కొండమల్లేపల్లి ఇన్‌చార్జి సీఐ రాజు తెలిపారు. తనిఖీలో కొండమల్లేపల్లి ఎస్‌ఐ రామ్మూర్తి, గుడిపల్లి ఎస్‌ఐ నరసింహులు, రాము, నాగరాజు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు

చిన్నారుల ఆట విడుపు



యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలకేంద్రంలో క్రికెట్ ఆడుతున్న చిన్నారులు

పాఠశాలలకు వేసవి సెలవులు వచ్చేశాయ్. ఇళ్ల వద్ద ఉంటున్న చిన్నారులు వివిధ ఆటలతో గడుపుతున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో చిన్నారులు గురువారం క్రికెట్ ఆడి సందడి చేశారు.

● స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి- యాదాద్రి

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

రామన్నపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మే 1 నుంచి అడ్మిషన్లు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రహత్‌ఖానం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా అన్ని వసతులతో పాటు డాక్టరేట్ పొందిన అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యను బోధిస్తున్నామని పేర్కొన్నారు. డిజిటల్ క్లాస్ రూమ్‌లు, కంప్యూటర్ ఆధారిత విద్యా బోధన అందిస్తామని తెలిపారు. జాతీయ సేవా పథకం రెండు యూనిట్లు, అధునాత గ్రంథాలయ సౌకర్యం ఉందని తెలిఆరు. విశాలమైన ఆట స్థలంతో పాటు ఆధునిక సౌకర్యాలతో కూడి జిమ్ ఉందని, మెరిట్ స్కాలర్‌షిప్‌లతో పాటు, విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ బహుకరిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు.

ధాన్యం కల్లాలు లేక

● రహదారులపై ఆరబోస్తున్న రైతులు
● ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

ఆరుగాలం కష్టపడి పంటను సాగు చేసే రైతులకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. పంట పండించడం ఒక్క ఎత్తయితే చేతికి అందిన ధాన్యం విక్రయానికి, అరబెట్టడానికి అవస్థలు పడుతున్నారు. ధాన్యం ఆర బెట్టుకో వడానికి కొనుగోలు కేంద్రంలో స్థలం లేకపోవడంతో రహదారులపై ఆరబోస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)


యాదగిరిగుట్ట మండలం మల్లాపురం రోడ్డుపైన ఆరబోసిన ధాన్యం

ప్రభుత్వం ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తేమ 17శాతం ఉంటేనే కొనుగోలు చేయాలనే నిబంధన ఉంది. దీంతో రైతులు రైతులు తమ ధాన్యాన్ని తేమ లేకుండా రోజుల తరబడి ఆరబెట్టాల్సి పరిస్థితి నెలకొంది. ఆరబెట్ట డానికి సరియైనా ఖాళీ ప్రదేశాలు లేక రైతులు రోడ్లపై లేదా గ్రామాల్లో ఎక్కడ ఖాళీ ప్రదేశం ఉంటే అక్కడ తమ ధాన్యాన్ని ఆరబెట్టుకుంటూ నానా తిప్పలు పడుతున్నారు.

రోడ్లపైనే ధాన్యం రాశులు

యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో గతనెల నుంచి వరికోతలు మొదలై య్యాయి. ధాన్యం చేతికి రావడంతో తేమ తగ్గిం చి విక్రయించడానికి ఖాళీ ప్రదేశాలు, కొనుగోలు కేంద్రాలు, గ్రామాల్లో ప్రధాన రహదారులపై రైతులు ధాన్యం ఆరబోసుకుంటున్నారు. ఆరబెట్టే ప్రాంతానికి ధాన్యం తరలించడానికి అక్కడ నుంచి కొనుగోలు కేంద్రానికి తీసుకరావడానికి రవాణాభారం అధికమవుతోంది. ఒకవేళ ధాన్యం రోడ్డుపై ఆరబోయడంతో వాహనదారులు ప్ర మాదాల బారిన పడుతున్నారు. ఒకవేళ వర్షం వస్తే ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకో వడం అనేక ఇబ్బందులు పడుతున్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లా ఇలా..

మండలాలు : 17,
గ్రామ పంచాయతీలు : 248
వరి సాగు : 2.83 లక్షల ఎకరాలు,
రైతులు : 2.81లక్షలు,

ఈజీఎస్ ద్వారా కల్లాల నిర్మాణం అవకాశం


రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకోవడంలో వారి ఇబ్బందులను తొలగించడానికి గత ప్రభుత్వం కల్లాల నిర్మాణాలకు చర్యలు తీసుకుంది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వీటి నిర్మా ణం చేపట్టారు. రైతులకు సొంతభూమి ఉన్న రైతులకు ఈజీఎస్ ద్వారా ఇవి నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం అవకాశం కల్పించింది. అధి కారులు రైతులకు సరిగా అవగాహన కల్పించక పోవడంతో పాటుగా బిల్లు రావడం లేదని కల్లా ల నిర్మాణానికి రైతులు సుముఖంగా లేకపోవ డంతో ముందుకు రాలేదు.. దీంతో యాదాద్రి భు వనగిరి జిల్లాలో 1500 కల్లాలు మంజూరు కాగా కేవలం 390 కల్లాలు మాత్రమే నిర్మించు కున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నిధులు నిలిపి వేశారు

గతంలో రైతులు తమ భూముల్లో కల్లాలు నిర్మించుకోవడానికి కేంద్ర ప్రభు త్వం ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేసేది. దాంతో కొందరు రైతులు కల్లాలు నిర్మించుకున్నారు. కానీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో నిలిపి వేయడంతో కల్లాల నిర్మాణం నిలిచిపోయింది.

-నాగిరెడ్డి, డీఆర్‌డీవో, యాదాద్రి భువనగిరి జిల్లా

డబ్బులు ముందే చెల్లించాలి



గతంలో ప్రభుత్వం కల్లాల నిర్మాణానికి డబ్బులు సరిగ్గా ఇవ్వ డపోవడంతో కల్లం నిర్మించుకోలేదు.. సొంత డబ్బులు ఖర్చు పెట్టి కల్లాలు నిర్మించుకొనే స్తోమత లేదు. ప్రస్తుతం ధాన్యం ఆరబోసు కోవడానికి అనేక ఇబ్బందులు పడు తున్నాం. ప్రభుత్వం కల్లాల నిర్మాణానికి ముందుగానే డబ్బులు చెల్లిస్తే బాగుం టుంది.

-తాళ్ల ఉప్పల్‌రెడ్డి, రైతు

మూసీకి నిలకడగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

● మరో అడుగు పెరిగిన నీటిమట్టం

కేతేపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు 25 రోజు లుగా ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతుంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం గత 25 రోజుల్లో 6 అడుగుల మేర పెరిగింది. 645 అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు ఈ నెల మొదటి వారంలో సాగునీటి విడుదలను వేసిన నాటికి ప్రాజెక్టు నీటి మట్టం 623.50అడుగులు (0.71టీఎంసీలు) కనిష్ట స్థాయికి పడి పోయింది. ఈ క్రమంలో మూసీ నది ఎగువన గల ధర్మారెడ్డి కాల్వ, పిల్లాయిపల్లి, ఆసిఫ్‌నహర్ కత్వలు, ఇతర ఫీడర్ ఛానళ్లకు మూసీ నది పరివాహక ప్రాంత గ్రామాలు, హైదరాబాద్‌లో కురు స్తున్న అకాల వర్షాలు, హైదరాబాద్ నగరం నుంచి వచ్చే డ్రైనేజీ, వృథా నీటిని మళ్లించడంతో చిట్యాల, రామన్నపేట, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలంలోని పలు చెరువులు, కుంటలు నిండి ప్రస్తుతం అలుగులు పారుతున్నాయి. ఆయా చెరువులు, కుంటల అలుగుల నుంచి వచ్చే నీరంతా ప్రస్తుతం దిగువన గల మూసీ ప్రాజె క్టుకు చేరుతుండటంతో ప్రాజెక్టుకు దాదాపు 380 క్యూసెక్కుల పైచిలుకు ఇన్‌ఫ్లో నిరంతరాయంగా కొనసాగు తుంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం ఒక్కో పాయింట్ చొప్పున పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో ఇటీవలి వరకు 630.10అడుగులుగా ఉన్న ప్రాజెక్టు నీటిమట్టం బుధవారం సాయంత్రానికి మరో అడుగు పెరిగి 631.05 అడుగు లు (1.54టీఎంసీలు)గా నమోదైంది. కాగా గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టు నీటిమట్టం 624.20 అడుగులు (0.675టీఎంసీలు)గా, ఇన్‌ఫ్లో 300 క్యూసెక్కులుగా ఉంది.


మూసీ రిజర్వాయర్

సమాజ చైతన్యానికి రచనలు చేయాలి

● ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న


మిర్యాలగూడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న

మిర్యాలగూడ అర్బన్, మే1(ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలు సమాజ చైతన్యాన్ని అవసరమైన రచనలు చేయాలని ఎమ్మెల్సీ, ప్రజా వాగ్గేయకారుడు గోరేటి వెంకన్న అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని మినీ రవీంద్రభారతిలో గురువారం ఏర్పాటు చేసిన గోరేటి వెంకన్న పాట, మాటల స్ఫూర్తి సామాజిక సాహిత్య సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లా డారు. సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలక మైందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయా లని కోరారు. అనంతరం ఎమ్మెల్యే బీఎల్‌ఆర్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఆర్ట్స్‌కాలేజీ ప్రొఫెసర్ ఖాసీం, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ ప్రజా చైతన్యం కోసం కవులు, కళాకా రులు, రచయితలు చేస్తున్న కృషిని కొనియాడారు. అనంతరం కస్తూరి ప్రభాకర్ రచించిన మట్టికాళ్ల ముట్టడి, మధనం, ప్రభాకర చలనం పుస్తకాలను వారు ఆవిష్కరించారు. సాహిత్య సదస్సుకు ముందు చిన్నారుల ప్రదర్శించిన సాంస్కృతిక, చిత్రకళా ప్రదర్శ నలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మట్టిమనిషి వేనేపల్లి పాండురంగా రావు, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, ప్రముఖ కార్టూనిస్టు నర్సిం, జడ్పీ మాజీచైర్మన్ సీడీ రవి కుమార్, మానవహక్కుల వేదిక నాయకులు పి.సుబ్బారావు, నాగ వర్ధన్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ యూసుఫ్, సాహితీవేత్తలు ఉప్పుల పద్మ, సైదులు, నూకల వేణుగోపాల్‌రెడ్డి, బాలు, రామలిం గయ్య, రవి, శ్రీనివాస్, సత్యం పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా ప్రారంభం కాని రోడ్డు పనులు

● కల్వర్టులకే పరిమితమైన డీబీ తండా - కోనాపూర్, ముల్కలపల్లి- దేవోజీనాయక్ తండా పనులు
● శంకుస్థాపన దశలోనే పొట్టిమర్రి తండా - నాగాయపల్లి రోడ్డు
● ఇబ్బంది పడుతున్న ప్రజలు

తుర్కపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించినట్లుగా ఉంది గిరిజన తండాల పరిస్థితి. తండాల్లోకి వెళ్లే అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా మారాయి. దీంతో ఈ రోడ్లపై రాకపోకలు సాగించడానికి వాహనదారులు, ఆయా గిరిజన తండాల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముల్కల పల్లి- దేవోజీనాయక్ తండా మార్గంలో పంచాయతీ రాజ్ రోడ్డుపై గుంతలు పడి కంకర తేలడంతో ప్రజలు ఈ రోడ్డులో ప్రయాణిం చాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ గ్రామంలోని జాతీయ రహదారి నుంచి పాత గ్రామ పంచాయతీ వరకు 800 మీటర్ల దూరం సీసీ రోడ్డు వేయడానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. 25లక్షలు మంజూరు చేసింది. గ్రామంలో సీసీ రోడ్డు పను లకు అప్పటి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గొంగిడి సునీత 2022 మార్చి నాలుగో తేదీన శంకుస్థాపన చేశారు. కానీ సీసీ రోడ్డు పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ముందుకు రానందున నిర్మాణ పనులు శంకుస్థాపనకే పరిమితమయ్యాయి. తదనంతరం ముల్కలపల్లి జాతీయ రహదారి రోడ్డు నుంచి వయా గంగరాంతండా మీదుగా దేవోజీనాయక్ తండా, గొల్లగూడెం వరకు నాలుగున్నర కిలో మీటర్ల దూరం బీటీ రోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ నిధులు రూ.3.37కోట్లను, దయ్యంబండ - కోనాపూర్ మూడు కిలోమీటర్ల దూరం బీటీ రోడ్డు నిర్మాణానికి షెడ్యూల్ ట్రైబల్ వేల్ఫేర్(ఎస్టీ ఎస్‌డీఎఫ్) కింద గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ రోడ్డు నిర్మాణ పనులకు అప్పటి బీఆర్‌ఎస్ ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతమహేందర్‌రెడ్డి 2023లో శంకుస్థాపన చేసారు. ఈ రోడ్ల నిర్మాణం పనుల్లో భాగంగా సంబంధిత కాంట్రాక్టర్లు ముల్కలపల్లి- దేవోజీనాయక్ తండా మధ్యల కల్వర్టుల నిర్మాణాన్ని రెండేళ్ల క్రితం పూర్తి చేశారు. దయ్యంబండ - కోనాపూర్ మార్గంలో కల్వర్టు నిర్మాణాన్ని ఆరు నెలల క్రితం పూర్తి చేశారు. పొట్టిమర్రి తండా నుంచి నాగాయపల్లి వరకు ఉన్న మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం షెడ్యూల్డ్ ట్రైబల్ వెల్ఫేర్(ఎస్టీ ఎస్‌డీఎఫ్) కింద రూ. 1.80కోట్లు మంజూరు చేసింది. ఈ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య 2024 మార్చి 13న శంకుస్థాపన చేశారు. సంవత్సరం దాటినా బీటీ రోడ్డు పనులు మాత్రం ముందుకు కదలలేదు. బీటీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించనందున సరైన రోడ్డు మార్గం లేక ఆయా గ్రామాలకు సంబంధించిన ప్రజలు, గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం పనులను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోనందున పూర్తికావడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యకం చేస్తున్నారు.


పొట్టిమర్రితండా -నాగాయపల్లి వరకు ఉన్న మట్టి రోడ్డు


నిర్మాణం పూర్తయిన కల్వర్టులు

రోడ్డు పనులు పూర్తి చేయించాలి



రోడ్డు నిర్మాణం పనులు ఆగిపోయి రెండేళ్లు పూర్తి కావొస్తుంది. గ్రామానికి వెళ్లే కట్టపై మట్టి కుప్పలు పోసి వదిలేయడంతో రాపోకలు సాగించాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు రాకపోకలు సాగిస్తుంటే దుమ్మూధూళి ఇళ్లల్లోకి వస్తున్నందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పందించి కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డు నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయించాలి.

● సిలివేరు దుర్గయ్య, సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి

మండల కేంద్రానికి రావాలంటే ఇబ్బందులు పడుతున్నాం



రోడ్డు అధ్వానంగా ఉన్నందున మండల కేంద్రానికి రావాలంటే అనేక ఇబ్బం దులు ఎదుర్కొంటున్నాం. వర్షాలు కురి సినప్పుడు రోడ్డుపై గుంతలు పడి బురదగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రజా ప్రతిని. దులు, అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి మెరుగైన రవాణా సదుపాయం కల్పించాలి.

●పసుపుల కనకరాజు, కోనాపూర్, తుర్కపల్లి

మిస్‌వరల్డ్ పోటీదారులకు పటిష్ట భద్రత

● ఐజీ సత్యనారాయణ ● నాగార్జునసాగర్‌లో ఏర్పాట్ల పరిశీలన


బుద్ధవనాన్ని పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ, ఎస్పీ శరత్‌చంద్రపవార్ తదితరులు

నాగార్జునసాగర్, మే 1 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్-2025 పాల్గొనే పోటీదారులు మే 12వ తేదీన సాగర్‌కు రానున్న సందర్భంగా పటిష్ట భద్రతను కల్పించనున్నట్లు ఐజీ సత్యనారా యణ తెలిపారు. సాగర్ హిల్‌కాలనీలో బుద్ధ వనం, విజయ విహార్ అతిథి గృహాలను గురు వారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈ నెల 10 నుంచి 31వ వరకు నిర్వహించనున్న మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనే పోటీదారుల్లో ఆసియా దేశాల నుంచి 30 మంది ఈ నెల 12న బుద్ధపూర్ణిమ సందర్భంగా సాగర్ హిల్‌కా లనీలో ఉన్న బుద్ధవనాన్ని సందర్శించనున్నట్లు ఆయన తెలిపారు. సాగర్‌కు వచ్చే పోటీదారు లకు అసౌకర్యాలు కలగకుండా 1500 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేయను న్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 12న సాయ ంత్రం 4:30 నుంచి 7:30 గంటల వరకు మి స్ వరల్డ్ పోటీదారులు సాగర్‌లో ఉంటారని తెలిపారు. ముందుగా విజయవిహార్ అతిథి గృహానికి చేరుకొని కాసేపు సేద తీరిన అనం తరం బుద్ధ పూర్ణిమ ఉత్సవాలల్లో పాల్గొంటా రన్నారు. బుద్ధవనంలో బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటించిన అనంతరం మహా స్తూపం లోపలి వైపున ఉన్న ధ్యాన మంది రంలో కాసేపు ధ్యానం చేస్తారని తెలిపారు. పోటీదారులు హైదరాబాద్ నుంచి సాగర్‌కు చేరుకొని మళ్లీ తిరిగి హైదరాబాద్‌కు వెళ్లే వరకు అవాంఛనీయ సంఘటనలు జరగకుం డా చూడాల్సిన బాధ్యత పోలీసు శాఖపై ఉంద న్నారు. నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, దేవర కొండ అడిషనల్‌ఎస్పీ మౌనిక పర్యవేక్షణలో భద్రత చర్యలను చేపడతారని ఆయన పేర్కొ న్నారు.

కార్యక్రమంలో గ్లోబల్ ఈవెంట్ కాబట్టి ఎంతో బాధ్యతగా విధులు నిర్వహించాల్సిన బాధ్యత పోలీసుశాఖపై ఉందన్నారు. మిస్ వరల్డ్ పోటీల విషయంలో కొందరు నిరసన తెలియజేస్తున్నారు కాబట్టి వారిని ముందుగానే గుర్తించి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా చూడాలన్నారు. ఎవరైనా నిరసనలు చేపడితే చట్టపరంగా వారిపై చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. సాగర్ పర్యటన విష యంలో ఎలాంటి అంతరాయం జరిగిన మిస్ వరల్డ్ పోటీదారులపై ఎంతో ప్రభావం పడు తుందన్నారు. పోలీసు శాఖ ఈ పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని రకాల చర్య లు తీసుకుంటుందని మీడియా కూడా పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమం లో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, సాగర్ సీఐ శ్రీను నాయక్, సాగర్, పెద్దవూర, తిరుమలగిరి(సా గర్) ఎస్ఐలు సంపత్, వీరబాబు, వీరశేఖర్, సతీష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు


తిరువీధి సేవలో ప్రబంధ పారాయణాలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట మే 1 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో గురు వారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రాగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపలంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్ర వెఢూర్యాలుతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది, వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తు లను కల్యాణ మండపంలో అధిష్టింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు స్వామివారి శేషవస్త్రాలు ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅ మ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆఆలయంలో నిత్య పూజలు జరిగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని రామలిం గేశ్వరస్వామికి నిత్యపూజలు యాగశాలలో నిత్య రుద్రహనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. అయితే వేసవి సెలవులు కావడంతో ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 32,67,774 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావ్ తెలిపారు.


యాదగిరిగుట్టలో క్యూలైన్లో భక్తులు

వైభవంగా పురపాట్లు సేవోత్సవం

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయంలో గురువారం వైభవంగా తిరునక్షత్ర మహోత్సవం ఆలయ పూజారులు నిర్వహించారు. జగద్గురు రామానుజాచార్య తిరునక్షత్రోత్సవాల్లో భాగంగా ప్రబంధ అధ్యాపకులలో కార్యమం నిర్వహించారు. రామానుజచార్య ఆళ్వార్ సేవతో తిరు వీధుల్లో ప్రబంధ పారాయణాలు చేపట్టి పురప్పాట్టు సేవ నిర్వహించారు.


యాదగిరిగుట్టలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

తుంగతుర్తి, మే 1 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు అందరూ దూరంగా ఉండాలని గోరంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు రాచ కొండ ప్రభాకర్ అన్నారు. మత్తు పదార్థాలు తీసుకుంటే కలిగే అనర్థాలను గురువారం తుంగతుర్తి మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్‌లో సిబ్బందికి లౌడ్ స్పీకర్ ద్వారా అవగాహన కల్పించారు. సమాజ సేవలో భాగంగా వేసవి సెలవుల్లో ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

నేరేడుచర్ల మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం నేరేడుచర్లలోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు మండలంలోని బోడల్‌దిన్న గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. బరువు తక్కువగా ఉన్న చిన్నారులను గుర్తించి వారికి బాలమృతం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బోడల్‌దిన్న కార్యదర్శి పద్మ, ఏఎన్ఎం మమత, సంధ్య, గోరి పాల్గొన్నారు.

10వ తరగతి ఫలితాల్లో 14వ స్థానంలో జిల్లా

జిల్లాలో 96.81శాతం ఉత్తీర్ణత

సూర్యాపేట అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. 2024-25విద్యా సంవత్సరానికి జిల్లాలో 96.81శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్ర స్థాయిలో 14వ స్థానంలో నిలిచింది. జిల్లా నుంచి 11,887మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. బాలురు 6077 మందికి 5845మంది ఉత్తీర్ణత సాధించగా, 232మంది ఫెయిలయ్యారు. 5810మంది బాలికలు పరీక్షలు రాయగా 5663మంది ఉత్తీర్ణత సాధించారు. 147మంది ఫెయిల్ అయ్యారు. జిల్లాలో బాలబాలికలు 379మంది ఫెయిల్ అయ్యారు. బాలురు 96.18శాతం, బాలికలు 97.47శాతం ఉత్తీర్ణత సాధించారు.

జిల్లాలో 798 పాఠశాలలు

జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్, మైనార్టీ రెసిడెన్షియల్, మోడల్ స్కూళ్లు మొత్తం 798 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో ప్రభుత్వ పాఠశాలలు 7, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 173, మోడల్ స్కూళ్లు 9, కేజీబీవీ 18, ఎయిడెడ్ స్కూళ్లు 2, ప్రైవేట్ పాఠశాలలు 122, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ 2, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ 8, మైనార్టీ రెసిడెన్షియల్ 4, మహాత్మజ్యోతిబాపూలే స్కూళ్లు 8, తెలంగాణ ప్రభుత్వ గురుకుల పాఠశాల 1, ఆశ్రమ పాఠశాలలు 2 ఉన్నాయి.

2025లో 100శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు

2025సంవత్సరంలో 190 పాఠశాలల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించాయి. అందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 85, మోడల్ స్కూళ్లు 2, కేజీబీవీ 10, తెలంగాణ గురుకుల పాఠశాల 1, ఆశ్రమ పాఠశాల 1, బీసీ వెల్ఫేర్ 6, మైనార్టీ 2, సోషల్ వెల్ఫేర్ 4, ప్రైవేట్ పాఠశాలలు 79 ఉన్నాయి.

2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాలు

2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో 96.91శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో మొత్తం 11,910మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. బాలురు 6,198మంది పరీక్షలు రాయగా 5,960మంది ఉత్తీర్ణత సాధించారు. 238మంది ఫెయిలయ్యారు. బాలికలు 5,712మంది పరీక్షలు రాయగా 5,582మంది ఉత్తీర్ణత సాధించారు. 130మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. మొత్తం 11,910మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 11,542మంది ఉత్తీర్ణత సాధించారు. 368మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. 96.91శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో జిల్లా 6వ స్థానంలో నిలిచింది.

2024లో జిల్లాలో 347 పాఠశాలలు

2024సంవత్సరంలో జిల్లాలో 347 పాఠశాలల నుంచి విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. అందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 168, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు 2, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు 8, రెసిడెన్షిల్ మైనార్టీ పాఠశాలలు 4, రెసిడెన్షియల్ పాఠశాల 1, ప్రైవేట్ పాఠశాలలు 117, మోడల్ స్కూళ్లు 9, కేజీబీవీ 18, ప్రభుత్వ పాఠశాలలు 7, బీసీ వెల్ఫేర్ 8, ఆశ్రమ పాఠశాలలు 2, ఎయిడెడ్ పాఠశాలలు 3 ఉన్నాయి. ఈ పాఠశాలల నుంచి 11,910మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

100శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు

2024సంవత్సరంలో 196పాఠశాలలు పదో తరగతి పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఎయిడెడ్

విద్యా సంవత్సరం	పరీక్షరాసిన విద్యార్థులు	ఉత్తీర్ణులు	శాతం	బాలుర శాతం	బాలికల శాతం	స్థానం
2024-25	11,887	11,508	96.81	96.18	97.47	13
2023-24	11,910	11,542	96.91	96.16	97.72	6



తిరుమలగిరిలో పదో తరగతి విద్యార్థులను ఊరేగిస్తున్న ఉపాధ్యాయులు

స్కూల్ 1, ఆశ్రమ పాఠశాల 1, బీసీ వెల్ఫేర్ పాఠశాలలు 6, కేజీబీవీ 7, మోడల్ స్కూళ్లు 3, ప్రైవేట్ పాఠశాలలు 87, రెసిడెన్షియల్ 1, రెసిడెన్షియల్ మైనార్టీ 4, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు 6, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 80లలో విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించాయి. రాష్ట్రంలో 6వ స్థానంలో నిలిచింది.

రాష్ట్రంలో మెరిట్ పెరగడంతోనే..



పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాలో కేవలం ఒక శాతం మాత్రమే పడిపోవడంతో రాష్ట్రంలో జిల్లా 14వ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో మెరిట్ పెరగడంతో స్థానాలు పడిపోయాయి. 2025సంవత్సరంలో 96.81శాతం ఉత్తీర్ణత నమోదైంది. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాం.

● అశోక్, డీఈవో, సూర్యాపేట

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



నేరేడుచర్లలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

నేరేడుచర్ల, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన విద్య అందుతుందని నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం బట్టు మధు అన్నారు. పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా ముద్రించిన కరపత్రాలను గురువారం విద్యార్థుల తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు ఆహ్లాదకర వాతావరణం, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడతాయని అన్నారు. విద్యార్థిలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రషీద్, యాదగిరి, శ్రీనివాసరెడ్డి, లాల్‌సాహెబ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అభినందన

తిరుమలగిరి, మే 1 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులను హెచ్ఎం దామెర శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను క్రాస్ రోడ్డు నుంచి జడ్పీహెచ్ఎస్ వరకు జీపులో డప్పుచప్పుళ్లతో ఊరేగించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లేపల్లి జానయ్య, తదతరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మహాసభలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ ముందుండి పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. గురువారం మండలంలోని ఘంటవారిగూడెంలో నిర్వహించిన పాలకవీడు, నేరేడుచర్ల మండలాల సీపీఐ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ సమగ్రత, సమైక్యత కమ్యూనిస్టుల లక్ష్యమని అన్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా నిత్యం ప్రజల మధ్య నిలబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేసేది కమ్యూనిస్టులేనని అన్నారు. ఈ మహాసభలో చిలకరాజు శ్రీను, రావుల సత్యం, యల్లబోయిన సింహాద్రి, కత్తి శ్రీనివాసరెడ్డి, లక్ష్మి, కొమర్రాజు వెంకట్, ఊదర వెంకన్న, జానయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకోవాలి

హుజూర్‌నగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకోవాలని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం జయప్రద అన్నారు. పదో తరగతి ఫలితాల్లో స్కూల్ టాపర్‌గా గురువారం పట్టణంలోని బాలికల పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో టాపర్‌గా నిలిచిన ఐల మౌనికను ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే లభిస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఈటీ జనార్దన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్దతు ధర పొందాలి

నూతనకల్, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లో రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ నాగం జయసుధాసుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మాచినపల్లి గ్రామంలో ఎఫ్‌టీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎఫ్‌టీవో సీఈవో చంద్రశేఖర్, చైర్మన్ చిత్తలూరి నారాయణ, పసుల అశోక్‌యాదవ్, ఏఈవో భవ్య, నజీర్, రామచంద్రు, సురేందర్, దామోదర్‌నాయక్, సైదులు, బంటు బద్రి, ఉప్పలయ్య పాల్గొన్నారు.


వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వేసవి శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ పరమేష్

మేళ్లచెర్వు, మే 1(ఆంధ్రజ్యోతి): వేసవి సందర్భంగా ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటుచేసే ఉచిత శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ పరమేష్ అన్నారు. జిల్లా యువజన క్రీడా సమాఖ్య అధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన ఉచిత వాలీబాల్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శిబిరం నిర్వాహకులు, వ్యాయామ ఉపాధ్యాయుడు కె.ఉపేందర్, ఎంఈవో వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, నారపరెడ్డి, సత్యప్రసాద్, శ్రీమన్నారాయణ, బషీద్, నర్సింహారావు, నర్సింహారెడ్డి, గ్రామీణ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

10 ఫలితాల్లో మేళ్లచెర్వు విద్యార్థికి 584 మార్కులు



ప్రద్యుమ్న

మేళ్లచెర్వు, మే 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన ఓరుగంటి ప్రద్యుమ్న 584/600 మార్కులు సాధించాడు. ఆ విద్యార్థికి బంధువులు, స్నేహితులు అభినందనలు తెలిపారు. ప్రద్యుమ్న తల్లి వాసవి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలుగా, తండ్రి నర్సింహారావు ఓ ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ మార్కులు సాధించానని, ఐఐటీలో సీటు సాధించటమే తన లక్ష్యమని ప్రద్యుమన్న తెలిపారు.

వాలీబాల్ శిక్షణా శిబిరం ప్రారంభం

కోదాడ రూరల్: మండలంలోని గుడిబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి ఉచిత వాలీబాల్ శిక్షణా శిబిరాన్ని ఎంఈవో సలీం షరీఫ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విమలకుమారి, కోదాడ పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, వరప్రసాద్ రెడ్డి, నాగిరెడ్డి, సర్వోత్తమ్‌రెడ్డి, పీడీ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా రెపరెపలాడిన ఎర్రజెండా



సూర్యాపేటలో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



హుజూర్‌నగర్‌లో మేడే వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు నాగన్నగౌడ్

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్: ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడేని జిల్లా వ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాలను ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్‌టీయూ జెండాను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఎగురవేశారు. సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు సీపీఐ జెండా ఎగురవేశారు. ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఎగురవేశారు. సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఆధ్వర్యంలో జెండాను జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ ఎగురవేశారు. పలు వార్డుల్లో వివిధ రాజకీయ నాయకులు జెండాలను ఎగురవేశారు.

● పెన్‌పహాడ్‌లో గ్రామ పంచాయతీ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు దనియాకుల శ్రీనివాస్, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రణపంగు కృష్ణ, సీపీఎం మండల కార్యదర్శి గుంజా వెంకటేశ్వర్లు ఎర్ర జెండాలను ఎగురవేశారు.

● హుజూర్‌నగర్‌లో ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, తన్నీరు మల్లికార్జున్‌రావు, బెల్లంకొండ గురవయ్య ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. నేరేడుచర్లలో సీపీఐ జిల్లా కార్యదర్శి గన్నా చంద్రశేఖర్ జెండా ఆవిష్కరించి ర్యాలీలో పాల్గొన్నారు. మేళ్లచెర్వులో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో ర్యాలీ నిర్వహించారు. మేళ్లచెర్వులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్మికులను నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. చింతలపాలెంలో లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. పాలకవీడులో సీఐటీయూ, సీపీఎం జెండాను సీపీఎం నేత అనంతప్రకాష్ ఆవిష్కరించారు.

● కోదాడలో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీని పీసీసీ ప్రతినిధి చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ఐఎన్‌టీయూసీ కోదాడ ప్రాంతీయ అధ్యక్షుడు పారా సీతయ్య జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కోదాడ పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన సభలో మాట్లాడారు. పట్టణంలో ఐఎన్‌టీయూసీ జెండాలతో నిర్వహించిన ర్యాలీ ఆకట్టుకుంది. ఎస్‌బీఐ ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.వెంకటరత్నం, చిట్టిబాబు, దాసు, షరీఫ్, చిట్టిబాబు, పవన్ శర్మ, నందన్‌రెడ్డి, ఉమామహేష్, పాల్గొన్నారు. కోదాడ పట్టణంలో సీపీఎం నాయకులు పట్టణంలోని బస్‌స్టేషన్ సెంటరు నుంచి సుందరయ్య భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ముల్కలపల్లి రాములు మాట్లాడారు. మునగాలలో నిర్వహించిన వేడుకల్లో కాసర్ల కోటేశ్వరారవు, బుచ్చి పాపయ్య, ఈదారావు పాల్గొన్నారు.

●చిలుకూరు మండలంలో జెర్రిపోతులగూడెంలో నిర్వహించిన మేడే వేడుకల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెలికంటి సత్యంలు తదితరులు పాల్గొన్నారు.

● తుంగతుర్తిలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, తిరుమలగిరిలో ఏపూరి సోమన్న, మద్దిరాలలో పోలోజు సైదులు, భాస్కర్, నాగెల్లి రాంనర్సయ్య, నూతనకల్‌లో కొలిశెట్టి దయాకర్‌రావు ఆధ్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించారు.



తుంగతుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు



సూర్యాపేటలో జెండా ఎగురవేస్తున్న సీపీఐ నాయకులు

స్ప్రెడ్ ఇండియా సేవలను సద్వినియోగం చేసుకోవాలి



బాలెంలలో శిక్షణ శిబిరానికి హాజరైన విద్యార్థులు

సూర్యాపేట రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): స్ప్రెడ్ ఇండియా సేవలను సద్వినియోగం చేసుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గోళ్లమూడి రమేష్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని బాలెంల గ్రామంలో స్ప్రెడ్ ఇండియా, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి హరివిల్లు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు.ఈ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. స్ప్రెడ్ ఇండియా వ్యవస్థాపకుడు పటేల్ శ్రీధర్‌రెడ్డి విద్యార్థులకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ శిబిరంలో ఆట వస్తువులు, డ్రాయింగ్స్ బుక్స్, కలర్స్, సైన్స్ ప్రయోగాలకు అవసరమయ్యే వస్తువులను విద్యార్థులకు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం ఏడు గంటల నుంచి 10గంటల వరకు విజ్ఞానంతో పాటు వినోదాన్ని అందించే ఈ శిబిరాన్ని ఒకటి నుంచి 9వ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు నీరజలత, పటేల్ కృష్ణారెడ్డి, స్ప్రెడ్ కో-ఆర్డినేటర్ వలపట్ల దయానంద్, స్ప్రెడ్ ఇన్‌చార్జి ఆవుల ప్రసాద్, రామచంద్రారెడ్డి, ఆకుల యాదగిరి, మమత, స్రవంతి, విజయ, నర్సయ్య, అశోక్, భిక్షం, సంధ్య, విజయరాణి, విద్యార్థులు పాల్గొన్నారు,

వేసవిలో దాహార్తి తీర్చడం అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్

కోదాడ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు వంటిపులి గోపయ్య అన్నపూర్ణ ట్రస్టు చేస్తున్న సేవలు అభినందనీయమని కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ అన్నారు. గురువారం కోదాడలోని మార్కెట్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గోపయ్య అన్నపూర్ణమ్మల కుమారుడు వంటిపులి వెంకటేష్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలో ఏడు ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటుచేసి వంటిపులి గోపయ్య అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ వంటిపులి ప్రేమ్‌కుమార్‌ను అభినందించారు.కార్యక్రమంలో శ్రీను, పుల్లయ్య, సంజీవ్ పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శంగా క్రికెట్ పోటీలు

సూర్యాపేట అర్బన్ , మే 1 (ఆంధ్రజ్యోతి): అందరికీ ఆదర్శంగా కుటుంబ స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని కోక కుటుంబ పెద్ద కోక బక్కయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలోని క్రీడా మైదానంలో కోక కుటుంబ స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కోక జోసఫ్, రంజిత్, వెంకటయ్య పాల్గొన్నారు.

మైనింగ్ స్థలాన్ని పరిశీలించిన జిల్లా అధికారులు

తిరుమలగిరి రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండ గ్రామంలో సర్వే నెం.98లో మైనింగ్‌ను నిలిపివేయాలని ఆ గ్రామస్థులు కోర్టును ఆశ్రయించారు. దీంతో మైనింగ్ స్థలాన్ని పరిశీలించి నివేదిక అందజేయాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌ను కోర్టు ఆదేశించింది. కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా అధికారుల బృందం సర్వే నెం.98లో పూరెళ్ల గుట్టలో జరుగుతున్న మైనింగ్ పనులను గురువారం పరిశీలించించారు. చుట్టుక్కల రైతులను అడిగి అభిప్రాయాలను తెలుసుకున్నారు. తాము వ్యవసాయాన్ని నమ్ముకుని బతుకుతున్నామని, మైనింగ్ తమ జీవనోపాధికి ఆటంకం ఏర్పడిందని పలువురు రైతులు అధికారులను తెలిపారు. నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ పాఠశాల కూడా ఇదే సర్వే నెంబరుకు అనుకుని ఉన్నందున పాఠశాల భవనానికి కూడా ప్రమాదం ఉందని, మైనింగ్ అనుమతిని రద్దు చేయాలని కోరారు. ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని, అనంతరం ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఆర్ఐ వసుమతి, సర్వేయర్ వెంకటేశ్వర్లు, ఇంటిగ్రెటేడ్ పాఠశాల డీఈ రమేష్‌కుమార్, ఏసీ రంగారావు, డీపీవో యాదయ్య, ఎంపీవో భీంసింగ్, కార్యదర్శి యాకుబ్‌రెడ్డి, సర్వేయర్ జోసఫ్, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.



తొండ గ్రామంలో మైనింగ్ ప్రాంతాన్ని పరిశీస్తున్న జిల్లా అధికారులు

పశు పోషకులు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి



మేళ్లచెర్వులోని వెంకటేశ్వర గోశాలలోని పశువులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

మేళ్లచెర్వు, మే 1(ఆంధ్రజ్యోతి): పశుపోషకులు పశువులకు సకాలంలో వ్యాధి నివారణ టీకాలు వేయించాలని గాలికుంటు వ్యాధి నివారణ రాష్ట్ర పర్యవేక్షణ అధికారి డాక్టర్ కె.అనిల్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర గోశాలలోని పశువులకు వ్యాధి నిరోధర టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అశ్రద్ధ వహించకుండా పశువులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయిండం ద్వారా పశు సంపదను కాపాడవచ్చని అన్నారు. రైతులందరూ పాడి-పంటపై శ్రద్ధ వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి కె.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ కె.వీరారెడ్డి, పశు వైద్య సిబ్బంది, గోశాల నిర్వాహకులు కొంకపాక విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మలు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతి క్రైస్తవులకు తీరని లోటు

సూర్యాపేట టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి క్రైస్తవులకు తీరని లోటని పాస్టర్లు జాషువా, అల్లం ప్రభాకర్‌రెడ్డి, జాన్‌బెన్నీలింగం, పోకల అశోక్, బెజవాడ రవికుమార్, దుర్గం ప్రభాకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో పాస్టర్ ప్రవీణ్ పగడాల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోట గోపి, పాస్టర్లు హెప్సిబా, గడ్డం డేవిడ్‌రాజు, గాబ్రియల్, జలగం జేమ్స్, ఏషయా, బాకీ పరంజ్యోతి, తలకప్పల సుధాకర్, ఉట్కూరి రాజు పాల్గొన్నారు.

తాలు పేరుతో దోపిడీ

(5వ పేజీ తరువాయి)

తరుగు తీస్తూ మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15శాతం తేమ ఉన్నా తరుగు పేరుతో మిల్లర్లు మోసం చేస్తున్నారని రైతులు తెలిపారు. హుజూర్‌నగర్ మండలంలో బూరుగడ్డ రెవెన్యూ పరిధిలో 10వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉండగా రైతులు ఈ ప్రాంతంలో ఎకరానికి 40 బస్తాల దిగుబడి సాధించారు. ధాన్యం విక్రయించే దశలో మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని ఎఫ్‌సీఐ గోదాంలో ధాన్యం దిగుమతి చేసేందుకు అధికారులు రోజుల తరబడి తిప్పుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్‌సీఐ గోదాంకు ప్రతిరోజు 50ట్రాక్టర్లకు పైగా ధాన్యాన్ని వ్యయ ప్రయాసలకు ఓర్చి తీసుకువచ్చినా దిగుమతి చేసుకోవడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్వింటాకు నాలుగు కిలోలు తరుగు తీస్తున్నారు

ప్రతి క్వింటాకు నాలుగు కిలోల తరుగు తీస్తున్నారు. బూరుగడ్డ నుంచి మునగాల బిన్నీ రైస్ మిల్లుకు తరలిస్తే దిగుమతి చేయకుండా కొర్రీలు పెడుతున్నారు. మిషన్లతో కట్ చేయించి 10 రోజులు ఎండబెట్టి సహకార సంఘాలకు ధాన్యం విక్రయిస్తే, మిల్లర్లు మోసం చేస్తున్నారన్నారు.

● కాసాని గోపాలం, రైతు, బూరుగడ్డ

తరుగుపై ఉన్నతాధికారులకు తెలియజేస్తా

తేమ శాతం తక్కువగా ఉన్నా, కొన్ని బస్తాల్లో తాలు ఉందని మిల్లర్లు దిగుమతి చేసుకోవడంలేదని రైతులు చెబుతున్నారు. మిల్లర్లతో మాట్లాడి తరుగు లేకుండా ధాన్యం దిగుమతి చేయిస్తా.

● కీర్తి వెంకటేశ్వర్లు, సీఈవో, బూరుగడ్డ